
# మేధావుల తీర్పు




**"పతితులారా భ్రష్టులారా, బాధాసర్పద్రష్టులారా**
**ఏడవకండేడవకండేడవకండీ**
**మీ కోసం నాయకుడ్డై, మీ బాధలతీర్చుటకై**
**వస్తున్నాడొస్తున్నాడు...**
**రచయిత మేధావి గారొస్తున్నారు...."**

ఇంట్లోకడుగు పెడుతూనే పాటలా పాడాడు మురళీధర్..నాదిక్కు చూస్తూ సోఫాలో కూర్చున్నాడు.

"ఏంటి మురళీధర్...! ఈ రోజు నిన్ను శ్రీశ్రీ ఆవహించినట్టున్నాడు...శ్రీశ్రీ కవిత్వం, నీ పైత్యం కలిపి పాటపాడేస్తున్నావు. ఇంతకీ పతితులు, బాధాసర్పద్రష్టులెవరు..? జగన్నాధరథచక్రాలెవరివి? అన్నాను నవ్వుతూ...

"మల్లిఖార్జున్...నాకు శ్రీశ్రీ జ్ఞాపకం రాని రోజు లేదంటే నమ్ము..నా పాటలోని బాధాసర్పద్రష్టులు మన ఫ్యాక్టరీలో పనిచేసే ఆఫీసర్లు. నువ్వే జగన్నాధరథచక్రానివై రావాల్సిన అవసరముంది..." అన్నాడు మురళీధర్.

"నీ మాటల్లోని ఒక్క ముక్కా నాకర్థం కాలేదు. అయినా మనమాఫీసర్లం కదా...! అంటే అధికారులం...మనం బాధాసర్పద్రష్టులమేంటి?" అని మురళీధర్ దిక్కు చూస్తూ నవ్వాను..

"పోజు కొట్టకు...అధికార్లమట అధికార్లం..సైన్యం లేని సైన్యాధిపతుల్లాంటివాళ్ళం మనం...ఇంటిపేరు కస్తూరివాళ్లే కాని ఇంట్లో గబ్బిలాలవాసనన్నట్టుంది మన సంగతి..." అన్నాడు మురళీధర్ కోపంగా...

"అవును మురళీధర్...! పదేళ్ళుగా పెరగని జీతాలు మన బతుకుల్ని దుర్భరం చేస్తున్నమాట నిజమే...మన దౌర్భాగ్యపు స్థితిగతుల్ని చూస్తుంటే మనం ఖచ్చితంగా బాధాసర్పద్రష్టులమేననిపిస్తుంది. పతితులం, భ్రష్టులం మాత్రం కాదు. ఏమంటారు?" అన్నాను..

"ఆ మాట నిజమే అయినా మనలోనూ పతితలూ, భ్రష్టులూ ఉన్నారు. ఇవన్నెందుకు కాని నువ్వీసారి ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంటుగా పోటీ చేయాలి. ఖచ్చితంగా అన్నాడు మురళీధర్.

ఆ మాటలు నాకాశ్చర్యాన్నే కల్గించాయి.

"నేనేంటి? ఎన్నికల్లో పోటీ చేయడమేంటి? నీకేమన్నా పిచ్చిపట్టిందా" అన్నాను.

"ఇదేదో అసెంబ్లీ ఎన్నికలో, పార్లమెంటెన్నికలో అయినట్టు భయపడిపోతున్నావేంటి? మూడువందల యాభైమంది ఆఫీసర్ల అసోసియేషన్‌కు ఎన్నికలు. ఏం నువ్వెందుకు ప్రెసిడెంటుగా పోటీ చేయకూడదు?" అన్నాడు మురళీధర్.

"పోటీ చేయడానికి నాకున్న అర్హతలేంటి?" అన్నాను.

"నీకు లేని అర్హతలేంటో చెప్పుమొదలు. ఇన్ని రోజులుగా పోటీ చేస్తున్న వాళ్ళు, గెలుస్తున్నవాళ్ళకున్న అర్హతలకంటే నీకేం తక్కువున్నాయి? ఈ పదవిని వెలగబెడ్తున్న వాళ్ళకుండాల్సిన అర్హతలేంటో చెప్పునాకు మొదలు.."

"అవన్నీ నీకనవసరం... నేనందుకర్హున్నా అన్నదే నా ప్రశ్న.."

"ఎందుక్కావు..? స్వంత లాభము కొంత మానుక పొరుగువానికి సాయపడవోయ్ అన్న ఆలోచన నీకుంది. మన ఉద్యోగుల్లో ఎవరికీ లేని ఉన్నత విద్య నీకుంది. మేధావిగా, రచయితగా మంచి పేరుంది? పదవి అడ్డుపెట్టుకొని ప్రమోషన్ పొందడమో, అందినవరకూ సంపాదించుకోవాలనో నీవనుకోవు.. ఇంకేం అర్హతలు కావాలి నీకు పోటీ చేయడానికి?"

"ఇవి కూడా అర్హతలేనంటావు..? ఈ అర్హతలతో గెలుస్తానని, గెలిచినా న్యాయం చేస్తానని సాకు మాత్రం నమ్మకం లేదు.."

"మల్లిఖార్జున్..! నువ్వు గెలిస్తే మంచిదే.. ఏ కొంచెం చేసినా ఇదవరకున్నవాళ్ళకంటే ఎక్కువే చేసినట్టువుతుంది. గెలువలేదనుకో. పోయేదేంలేదు. ఒక్కసారి మన ఆఫీసర్ల సంగతాలోచించు. పేరుకు అధికార్లం, అధికార్లంకాబట్టి అనవరమైతే ఇరవైనాలుగ్గంటలూ పనిచేయాలి? ఎప్పుడు అవసరముంటే అప్పుడు ఫ్యాక్టరీలో ఉండాలి. వర్కర్లకు అరగంటెక్కువున్నా ఓవర్ టైం వస్తుంది. మరి మనకేమొస్తుంది? మన వేతనాలు ముఖ్యంగా జూనియర్ ఆఫీసర్ల వేతనాలెంత ఘోరంగా ఉన్నాయో మనకు తెలిసిందే కదా..! మన బతుకుల్లోని ట్రాజెడీని మరిచిపోయి ఇంటలెక్చువల్ పోజు కొడుతుంటారు మనవాళ్ళు. సఫారీల మాటున బాధలు దాచుకుంటారు కొందరు. ఇలాంటి పరిస్థితుల్లో నీలాంటి వాళ్ళ అవసరం చాలా ఉంది.."

అంటే నేను పోటీ చేయడం తప్పదంటావు.."

"నాకైతే నువ్వు చేయడం తప్పనిసరనిపిస్తుంది. ఈ పోటీవల్ల నీకు ఇంటలెక్చువల్స్ పై ఉన్న కొన్ని ప్రశ్నలకు సమాధానం కూడా లభిస్తుంది. గెలిస్తే మేధావి వర్గానికి నాయకత్వం వహిస్తున్న థ్రిల్లూ ఉంటుంది..."

నేనుంటున్న కాలనీ మినీ ఇండియా లాంటిది కేంద్రప్రభుత్వ యాజమాన్యం కింద పనిచేసే కర్మాగారం కావడం వల్ల దేశంలోని అన్ని భాషల, ప్రాంతాల రాష్ట్రాల వాళ్ళిక్కడ పనిచేస్తున్నారు. నా దేశపు మేధావులపై బ్యాలట్ ప్రజాస్వామ్యంపై నాకు ప్రగాఢ నమ్మకముంది. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తే నేను మురళీధర్‌తో ఇతర మిత్రులతో వాదించే ప్రశ్నలకు సమాధానమూ దొరికినట్టవుతుంది...

నేనాలోచనలో పడ్డాను.

మురళీధర్ చెప్పినట్టు పోటీ చేయడానికంగీకరించాను.

"కొన్ని ప్రిన్సిపుల్స్‌కు కట్టుబడి బతుకుతున్న నన్ను ఎన్నికల్లోకీడుస్తున్నావు. సరే నేను పోటీ చేస్తాను. కానీ నా ప్రిన్సుపుల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ తిలోదకాలివ్వను. ఇప్పుడు ఓటేసేది మేధావులే కాబట్టి వాళ్ళకు నా సిద్ధాంతాలు తప్పకుండా నచ్చుతాయని నానమ్మకం" అన్నాను మురళీధర్‌తో. "ప్రిన్సిపుల్స్ అనే మాట కూడా భూతద్దం వేసి చూసినా కనవడని కాలంలో ప్రిన్సుపుల్స్ పైన్నే నడుస్తానంటావు. సరే. అలాగే కానియ్యి. మొదలైతే పోటీ చేయి.."

అందరికంటే ముందే నామినేషన్ దాఖలు చేసాను. నా నామినేషన్ మా ఫ్యాక్టరీలో సంచలనవార్తే అయింది.

"చప్పుడుజేక రాసుకుంటూ కూచోక రాజకీయాలెందుకు...?"

"ఈ పెంట రాజీకీయాలు నీకు పడవు మల్లిఖార్జున్.."

"మల్లిఖార్జున్ ముక్కుకు సూటిగా పోయే వ్యక్తి ఆయన్నుంచి రాజకీయాలు కావు..."

"ఎందుకు ఆయన తలుచుకుంటే ఏదైనా చేయగలుగుతాడు. ఏ విధంగా చూసినా ఇదువరకు చేసిన ప్రబుద్ధులకంటే నయమే..."

ప్రత్యక్షంగా, పరోక్షంగా నా గురించి అంటున్న అనుకుంటున్న మాటలు నా చెవిన పడుతూనే ఉన్నాయి.

ఓ చీఫ్ ఇంజనీయర్ నన్ను పిలిపించుకున్నాడు.

అనునయంగా చెప్పాడు. "మల్లిఖార్జున్! నువ్వు నాకు బాగా తెలుసు.. కల్లాకపటం ఎరగని మనిషివి. ముక్కుకు సూటిగా పోయే స్వభావం కలవాడివి. హాయిగా కథలవీ రాసుకుంటూ గడుపుతున్నవాడివి. ఈ ఊబిలోకెందుకు దిగుతున్నట్టు?" అన్నాడు.

"అంటే ఎన్నికలంటే ఊబేనా సార్... " అడిగాను.

"ఊబికాక మరేంటి? ఇందులో ఎన్ని గందరగోళాలు...? ఎన్ని రభసలు? చెత్త ఎత్తుగడలు... ఇవన్నీ నువ్వు తట్టుకోగలవా..?"

"సార్..! నేనన్నీ తట్టుకోగలననే అనుకుంటున్నాను. నేనో సదుద్దేశ్యంతో ఇందులోకి దిగుతున్నాను. అందుకోసం దేనినైనా తట్టుకోక తప్పదు"

"తట్టుకుంటావు నిజమే. కాని ఈ బురదలో కూరుకుపోయి నీకున్న రాసే అలవాటును మానుకుంటావేమోనని భయంగా ఉంది. రచనల రంగంలో నువ్వు చేస్తున్న కృషి అద్వితీయం. ఇందులో దిగితే నీకు సమయం దొరకదేమోనని నా భయం"

"మీకాభయమక్కర్లేదు సార్.. దేని సమయాన్ని దానికే కేటాయించి సమయపాలన పాటిస్తే అన్నిపనులూ చేసుకోవచ్చుసార్..." అన్నాను.

"ఎవరిజోలికీ పోకుండా నీ పని నువ్వు చేసుకుంటూ పోతుంటావు.... అలాంటి నువ్వీందులోకి దిగడం నాకైతే ఆశ్చర్యకరంగానే ఉంది. ఇంతకీ నువ్వీందులోకెందుకు దిగినట్టు...?"

"తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉంది సార్ మన ఫ్యాక్టరీ పరిస్థితి. అందులో మన అధికార్ల పరిస్థితి మీకు తెలియంది కాదు. కార్మికులు తమకున్న ట్రేడ్ యూనియన్ ఆయుధంతో ఎంతో కొంత సాధించుకుంటున్నారు. మరి మనల్ని పట్టించుకునేదెవరు? అధికార్లపేరు మీద కట్టుబానిసల్లా పనిచేయడం తప్పడం లేదు. నా సోదరుల కోసం ఎంతో కొంత చేద్దామన్న చిత్త శుద్ధితోనే ఈ ఎన్నికల్లోకి దిగుతున్నాను. ఓడినా ఈ నెపం మీద నా తోటి ఆఫీసర్ల కష్టసుఖాలు, సాదక బాధకాలు తెలుసుకునే అవకాశముంది. గెలిచినా, ఓడినా నా దేశమేధావులపై నాకున్న అభిప్రాయాలకు సమాధానాలు దొరుకుతాయి. నాకు ఒకటి రెండు కథలకు ప్లాటూ దొరుకుతుంది."

నా మాటలు విని పకపకా నవ్వాడు చీఫ్ ఇంజనీయర్‌గారు...

"నీ సోదరులకేవిధంగా ఉపయోగపడ్తావో, ఉద్ధరిస్తావో నాకైతే తెలియదుకాని అదేమంత సులభం కాదు. కాని కొంత జాగ్రత్తగుండు. ఇంతకాలం ప్రిన్సుపుల్స్ కోసం బతుకుతున్నవాడివి. ఈ బురదగుంటలో పడి అన్నిటికీ తిలోదకాలిస్తావేమోనని నా భయం.."

"మీకు నా మీదున్న నమ్మకానికి ధన్యవాదాలు సార్.. గెలుపుకోసం కాని, ఒకవేళ గెలిచిన తర్వాత కాని నేను దేనితోనూ రాజీ పడను... ఓట్ల కోసం కులాలు, మతాలు, ప్రాంతాలు, డిపార్ట్‌మెంటుల మీటింగులేవీ పెట్టను. నా మానిఫెస్టో ఇస్తాను.. అవసరముంటే దానిపై చర్చ కోరుతాను. వీటిని నచ్చి ఓటేస్తే సరే... లేకుంటే నా రంగం నాకుండనే ఉంది. చాలా కాలంగా నా మెదట్లో ఓ ఆదర్శ అసోసియేషన్ రూపం రూపుదిద్దుకుంటుంది. నేను గెలిస్తే దాన్ని అమల్లో పెట్టడానికి ప్రయత్నిస్తాను."

"మానిఫెస్టోలకు ఓటేసే కాలం కాదిది. మొత్తంమీద నువ్వు గెలవకపోవడమే నాకిష్టం. గెలిస్తే బురదలో ఇరుక్కుపోతావన్న బాధతప్ప మరేంలేదు.."

"మీ అభిమానానికి థాంక్స్ సర్" అని అతనికి నమస్కరించి లేచివచ్చాను.

ఉద్యోగులందర్నీ ఒకసారి కలుసుకోవాలని ఆ తర్వాతే మ్యానిఫెస్టో తయారు చేయాలని మురళీధర్‌ను వెంటబెట్టుకొని ఒక్కొక్కర్నే కలుస్తున్నాను.

"మనకీ పరిస్థితుల్లో కావాల్సింది మీలాంటి నిజాయితీపరుడే..చిత్తశుద్ధి ఉన్నవాడే. మీరు తప్పకుండా గెలుస్తారు." అన్నాడో ఇంజనీర్.

"మీకు ఆదర్శాలు, అభిప్రాయాలు కలిసే వాళ్ళు తప్ప ఓటెయ్యరు. వీళ్ళ సంగతి నాకు బాగా తెలుసు. మీకు మూడువందల యాభై ఓట్లలో పదిపన్నెండుకంటే ఎక్కువ పడవు. అలా పడాలని నా ఉద్దేశ్యంకాదు." అన్నాడు శేషగిరిరావు. అతడు చక్కని విశ్లేషణ చేసే వ్యక్తని నాకు తెలుసు.

ఎవరి అభిప్రాయాలేవైనా నేను ముందుకు పోవడానికే నిర్ణయించుకున్నాను. ఆదర్శవంతమైన, ఆచరణయోగ్యమైన మానిఫెస్టోను తయారు చేసాను.

వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాల్సిన అవసరాన్ని, ఎనిమిది గంటల పనికే జీతం పొందుతూ ఎన్నిగంటలైనా పనిచేసే విధానానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అగత్యాన్ని, నాయకుడి కుండాల్సిన లక్షణాలను, ఆఫీసర్లకు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని, నిజ వేతనాలు పడిపోతున్న వైనాన్ని ...ఇంకా అనేక విషయాలను అందులో పొందుపరిచారు.

ఎవరు గెలిచినా వారు చేస్తానన్న పనులు చేయకుంటే నిలదీసి అడిగి దిగిపోవాలని డిమాండ్ చేయాలని అందులో హెచ్చరించాను. నేను గెలిచి ఆరునెలలు లేదా ఏడాదిలో పనులు చేయలేకపోతే రాజీనామా చేస్తాననీ అందులో రాసాను..

నా మానిఫెస్టో ఉద్యోగుల్లో సంచలనంలాంటిదే కల్గించింది. దాని మీద విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి.

"మేమింత వరకు ఇలాంటి మ్యానిఫెస్టోను చూల్లేదు..."

"మిమ్మల్ని గెలిపించకుంటే మా అంత బుద్ధి తక్కువ వాళ్ళుండరు..."

"ఎంతైనా ఇంటలెక్చువల్ మానిఫెస్టోకదా...!"

నన్నందరభినందిస్తున్నారు...

పరిస్థితిని చూస్తుంటే నా కెంతో ఆనందంగానే ఉంది..

"మల్లిఖార్జున్ నీ మానిఫెస్టో Approach మన అధికారవర్గంలో గొప్ప సంచలనంలాంటిదే లేపింది. ఇలాంటివి వాళ్ళకు కొత్త...దీనికి తోడు మనం విస్తృతంగా తిరగాలి...మిగతా మూడు గ్రూపులవాళ్ళు కులాలవారిగా, ప్రాంతాలవారిగా, ఉద్యోగం చేస్తున్న కేడర్లవారిగా, బి.సి, ఎస్.సి, బ్రాహ్మణ తెగలవారిగా సమావేశాలనీ జరుపుతున్నారు...మనమూ కొంతైనా ఆ ప్రయత్నం చేస్తే విజయం ఖాయం.." అన్నాడు మురళీధర్.

నాకా మాటలసలే నచ్చలేదు.

"మన ఆఫీసర్లలో చాలామంది దాదాపందరూ ఇంజనీరింగ్ డిప్లొమానో, డిగ్రీనో, బి.యస్సీయో, ఎమ్మెస్సీయో, డాక్టర్ డిగ్రీలో ఉన్నవాళ్ళే కదా...? అంటే దాదాపందరూ ఇంటలెక్చువల్ కమ్యూనిటీ కిందికే వస్తారు...వీళ్ళు కూడా ఇలాంటి ప్రలోభాలకు లొంగుతారని నేననుకోను...మురళీధర్...ఏదేమైన నేను ప్రిన్సిపుల్స్‌ను కాదని దిగజారను. చేయగలిగే విషయమయితేనే చెప్పడం, చెప్పిందే చేయడం నా కలవాటు. నా సిద్ధాంతాలు, మానిఫెస్టో అప్రోచ్ నచ్చి గెలిపిస్తే సరే...లేకుంటే పోయేదేం లేదు కదా...!! " అన్నాను.

"కొంతైనా పట్టువిడు వుండాలి. అందరేవేవో జిమ్మిక్కులు చేస్తుంటే నువ్వు సిద్ధాంతాలంటూ కూర్చుంటే ఎలా...? ప్రెసిడెంటుకు పోటీ ఉన్న నలుగురిలో నువ్వొక్కడివే బి.సి.వి. ఆ ఓట్లను నువ్వు కూడగట్టుకోగలిగితే బాగుంటుంది. ఇది మంచి అవకాశం..."

> **"తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉంది సార్ మన ఫ్యాక్టరీ పరిస్థితి. అందులో మన అధికార్ల పరిస్థితి మీకు తెలియంది కాదు. కార్మికులు తమకున్న ట్రేడ్ యూనియన్ ఆయుధంతో ఎంతో కొంత సాధించుకుంటున్నారు. మరి మనల్ని పట్టించుకునేదెవరు?...."**

"మురళీధర్...! దయచేసి నన్నీ విషయంలో బలవంతం చేయకు. నా విధానాలు నచ్చి ఓటేసేవాళ్ళు ఒకరిద్దరున్నా చాలు.. నేను గెలిచినా, గెలువకున్నా ఆఫీసర్లలో ఓ చైతన్యాన్ని తెచ్చినట్టవుతుంది. నూతన పద్ధతిలో నడిపే ఓ ఆదర్శవంతమైన అసోషియేషన్ కావాలంటే నన్ను గెలిపించుకుంటారు.. లేదా ఏ రాయి అయితేంది తల పగులకొట్టుకుంటానికని నా మానిఫెస్టోలో చెప్పాను కదా. ఉన్నత విద్యావంతులైన మన ఆఫీసర్లు సరిగ్గానే ఆలోచిస్తారని, నిర్ణయం తీసుకుంటారని నా నమ్మకం.." అన్నాను స్పష్టంగానే.

" నీకున్న నమ్మకానికి నా జోహార్లు కాని అలా జరుగదేమోనని నా అనుమానం.. మన వాళ్లందరూ కులాల మీటింగులకు సమధికోత్సాహంతో పోతారన్న విషయం నీకు తెలియదేమో!"

" పోతే పోతారేమో! అయినా అవి వ్యక్తిగతమైన విషయాలు. ఇది అందరికీ సంబంధించింది కాబట్టి అలా చేస్తారనుకోను"

" నీ విశ్వాసానికి మరోసారి జోహార్లర్పిస్తున్నాను గాని ఒక్కొక్కర్ని కలుసుకొని మాట్లాడుదాం."

" అలా అన్నావు బాగుంది"

మురళీధర్‌ను, మరో ఇద్దరు మిత్రుల్ని వెంబడించుకొని ఒక్కొక్కర్ని కలిసి మాట్లాడటం ప్రారంభించాను. ఇలా కలుసుకోవడం వల్ల నాకెన్నో విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది. పైకెంతో గంభీరంగా కనబడుతున్న వాళ్ళలోనూ రగులుతున్న అసంతృప్తి జ్వాలలు, అగ్నిపర్వతాలు నాలో ఆలోచనలను రేపాయి.

" కొడిగట్టిన దీపంలా ఉన్న ఈ ఫ్యాక్టరీలో ఆఫీసరంటే బానిసే. అందులో జూనియర్ ఆఫీసర్ పరిస్థితి మరీ ఘోరం. ఫ్యాక్టరీకే అంకితమై బతుకుతున్నా ఇటు కార్మికుల్నుంచి, అటు పై అధికారుల్నుంచి వేదింపులు తప్పవు. పెరగని జీతాలు. పెరుగుతున్న ఖర్చులు. 1992 జనవరి నుంచి కావాల్సిన వేతన ఒప్పందం ఇంకా అమలు కాలేదు. నష్టాల్లో నడవడానికి బాధ్యత మనదెంతుంది ? నిజంగా ఇలాంటి కర్మాగారాల్లో నిజమైన బాధితుడెవడంటే జూనియర్ ఆఫీసరే. మింగ మెతుకు లేకున్నా మీసాలకు సంపెంగ నూనని ఆఫీసరన్న పేరోటి " అన్నాడు నరేందర్.

ఆ మాటల్లో ఎన్నో నగ్నసత్యాలు కనబడ్డాయి నాకు.

" నేను పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి ఈ ఫ్యాక్టరీలో జాయినయ్యాను. ఇప్పుడు మూడు పోస్టుగ్రాడ్యుయేటు డిగ్రీలున్నాయి. నేనిక్కడ జాయినయ్యేప్పుడు నా మిత్రుడు జూనియర్

లెక్చరర్‌గా జాయినయ్యాడు. అతడిప్పుటికీ జూనియర్ లెక్చరర్‌గానే వున్నాడు. నాకు నాలుగు ప్రమోషన్లొచ్చాయి. మేం జాయినయ్యే సమయంలో నా జీతం నా మిత్రుని జీతం కంటె యాభైరూపాయలెక్కువ. ఇప్పుడు నా జీతం కంటె ఆతని జీతం మూడు వేలెక్కువ. ఇదీ మన ప్రభుత్వరంగ సంస్థల పరిస్థితి." అన్నాడు కె.యస్.ఎన్. మూర్తి.

" మనకు వేజ్ ఒప్పందం కాకపోవడమొక కారణమైతే ఇలా జరగడానికింకా అనేక కారణాలున్నాయి. ఈ ఇరవై ఏళ్ళలో ప్రభుత్వరంగ సంస్థలకంటె మిగతా అన్నిట్లో జీతాలు బాగా పెరిగాయి. మనకేమో నామ మాత్రంగా పెరిగే పెరుగుదల కూడా లేదాయె. ఏమన్నంటే సిక్ యూనిట్లని బెదిరిస్తారు." అన్నాడు మురళీధర్.

" సిక్ యూనిట్‌గా మారడానికి మనమెంత బాధ్యులమన్న సంగతి వదిలిపెడితే దీంతో వేజ్‌ను లింకు పెట్టడం అప్రజాస్వామికం. పెరుగుతున్న జీవన వ్యయాన్ని, ధరలను, ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ఇన్నేళ్ళకోసారి వేతన ఒప్పందం జరగాలనుంటుంది. 1987లో జరిగిన కనీస వేతన ఒప్పందపు జీతాలనే మనమింకా పొందుతున్నాం. ధరలు రోజు రోజుకూ పెరుగుతుంటే మన జీవన ప్రమాణాలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. అయినా ఎవరికీ చీమ కుట్టినట్టయినా లేదు. కార్మికులకు కొంతైనా ఓవర్‌టైమ్ రావడంవల్ల కొంత నయం. మరి మునగతేం కావాలి? చుట్టు పక్కల వాళ్ళ జీతాలతో పోల్చుకుంటే తలెత్తుకోలేని పరిస్థితులు. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. "

రాజిరెడ్డి ఆవేదనలో అర్థముంది. ఇలాంటి బాధలు కొన్నైనా నేనూ అనుభవిస్తున్నాను. కాబట్టి అందులో అసహజమైనదేం కనబడలేదు నాకు.

" చాలామంది స్వంత ప్రమోషన్ల గురించో, తన, తనవాళ్ళ సమస్యలు చేయడం గూర్చో అసోషియేషన్ ఎన్నికల్లో పాల్గొంటారు. మీకలాంటి ఉద్దేశ్యమేం లేదు కదా !" అడిగాడో మిత్రడు.

" నేనొకవేళ గెలిస్తే పదవిలో ఉన్నంత కాలం నాకు నార్మల్‌గా ఎవరి వ్యక్తిగత ప్రమోషన్ల గూర్చీ రూల్సుకు విరుద్ధంగా ప్రయత్నం చేయను. నా వాళ్ళయినా, కాకున్నా ఎవరికీ అన్యాయం జరుగకుండా మాత్రం చూస్తాను" అన్న నా మాటలతో ఆతడు సంతృప్తి పడ్డట్టే కనబడ్డాడు.

" మీకు పొలిటికల్ బ్యాక్‌గ్రౌండేమీ లేదు కదా! ఒకవేళ మీరు గెలిచినా అదేం లేకుండా మీరు సమస్యలనెలా పరిష్కరిస్తారు?" అన్నాడు మరో ఆఫీసర్.

" ఎవరో తోడు వస్తారని ఏదో మేలు చేస్తారని ఎదురు చూడకుండా మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలన్న విషయాన్ని నమ్ముతాను నేను. మనలో చిత్త శుద్ధి, ఐక్యత ఉంటే మన న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించుకోవడమో సమస్య కాదు. పొలిటికల్ బ్యాక్‌గ్రౌండు ఉందంటూ ఎం.పీలు, మంత్రులు మా వాళ్ళేనంటూ, నేను ఫలానా రాజకీయ పక్షానికి చెందినవాన్నంటూ ఢిల్లీప్రయాణాలు చేస్తూ ఇంతవరకున్న వాళ్ళు సాధించినదేంటో చెప్పండి. ఒకవేళ మన సమస్యల పరిష్కారానికి రాజకీయ జోక్యమే అవసరమైతే ప్రెసిడెంట్‌గా ఏ రాజకీయ నాయకున్నైనా కలుసుకుంటాను. నాకున్న ఇంటలెక్చువల్ పరిచయాల ద్వారా ఏ పార్టీవాళ్ళతోనైనా పని తీసుకుంటాను.." అన్నాను.

> **" ఎవరో తోడు వస్తారని, ఏదో మేలు చేస్తారని ఎదురు చూడకుండా మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలన్న విషయాన్ని నమ్ముతాను నేను. మనలో చిత్త శుద్ధి, ఐక్యత ఉంటే మన న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించుకోవడమో సమస్య కాదు.."**

నా మాటలు కొందరికి సంతృప్తి కలిగించినట్టే అనిపించాయి.

" వేతన ఒప్పందం గూర్చి ఏం చేస్తావో చెప్పమని చాలామంది అడుగుతున్నారు మల్లిఖార్జున్..?" అన్నాడు మురళీధర్.

" ఇది ఒకరివల్ల అయ్యేపని కాకున్నా అందర్నీ కదిలించే ప్రయత్నం చేస్తాను. మనం చేయని నేరానికి అందరూ కొత్త వేతనాలు పొందుతుంటే మనకెందుకు రాకూడదో తెలుపుతూ మన పరిస్థితులను వివరిస్తూ అన్ని జాతీయ పత్రికల్లో వార్తలు, వ్యాసాలు వచ్చేట్టు చూస్తాను. మన నిజవేతనాలు రోజురోజుకూ దిగజారుతున్న విషయాన్ని, ఇతరులతో పోల్చుకున్నపుడు మన జీతాలెంత అధ్వాన్నంగా ఉన్నాయో వివరిస్తూ ఇవన్నీ ప్రభుత్వదృష్టికి వచ్చేట్టు చేస్తాను. కాకుంటే మనకున్న ఆయుధాలుండనే ఉన్నాయి. ఈ రోజు శాసనకర్తలే సమ్మెలు చేస్తున్నప్పుడు ఆఫీసర్ ముద్రలున్నంత మాత్రాన మనం చేయొద్దనేముంది ?"

నా మాటలపై చాలామందికి నమ్మకం కలిగినట్టే అనిపించింది. ఒకతను వ్యక్తిగత ప్రమోషన్ గురించి అడిగాడు.

" దయచేసి మేధావులైన మీరు నా మాటలనర్థం చేసుకోండి. నాయకుడంటే బ్రోకర్ కాకూడదు. వ్యక్తిగతమైన ప్రమోషన్లు, లాభాల కొరకు అందరికీ సంబంధించిన విషయాలను వదులుకోగూడదు. న్యాయంగా రావాల్సిన విషయాల గూర్చి వ్యక్తిగతమైనవైనా ఎవరూ చెప్పకున్నా నేను చేస్తానని ఇదివరకే చెప్పాను. మనం ఒక ఆదర్శవంతమైన అసోషియేషన్‌ను నడిపిద్దాం. మనమంతా ఆత్మగౌరవం కలిగి బతికేట్టు, 'వేర్ ది మైండ్ ఈజ్ వితవుట్ ఫియర్ .. ఠాగూర్ పద్యంలోని తలెత్తుకు తిరగ గలిగే విధంగా బతకడానికి ప్రయత్నిద్దాం." అన్నాను.

ఒక్కొక్కరినీ కలుసుకొని చర్చించాను.

కొందరు ఆఫీసర్లమనే భేషజాలను ప్రదర్శించినా చాలామంది తమ విషయాలన్నిట్నీ దాపరికాలు లేకుండానే చెప్పారు. వాళ్ల బాధలు, సమస్యలు వింటుంటే తప్పకుండా గెలిచి వాళ్ళకోసం సాధ్యమైనంత చేయాలనిపిస్తుంది నాకు. అందుకే నా ప్రయత్నాలను మరింత తీవ్రతరం చేసాను.

ఒక్కొక్కరి దగ్గరికెళ్ళ సమస్యల గూర్చి చర్చిస్తున్న నాకు కొందరి మాటలు వింటుంటే కళ్ళకు నీళ్ళొస్తున్నాయి.

" నా కొడుకు చదువులో మంచి ఇంటలీజెంటే. నాకేమో వాణ్ని ఇంజనీరింగ్ చదివించాలనుంది. కాని వాడు చచ్చినా చదువనంటున్నాడు. అందుక్కారణం వాడు చదువలేక పోవడం కాదు. " అన్నాడు మోహన్‌రావ్.

అందరూ ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సులకెగబడ్తుంటే ఆ ఇంజనీయర్‌గారి కొడుకుకెందుకు చదువనంటున్నాడో నాకర్థం కాలేదు.

" మీ బాబెందుకలా అంటున్నాడు ?" అడిగాను.

"నన్ను చూసి..."

ఆ మాటలకు మరీ ఆశ్చర్యపోయాను. " మీకేమైంది..?" అన్నాను.

" నేను మెకానికల్ ఇంజనీయర్‌ను కదా మల్లిఖార్జున్‌గారూ...! మేంటేనెన్స్ వర్క్ ఇంఛార్జిని. ఎక్కడో చోట ఏదో జాబ్ ఉండనే ఉంటుంది. పొద్దున డ్యూటీ వెళితే ఏ సాయంత్రమో ఇంటికి రావడం..వచ్చి ముఖమవీ కడుక్కొని కొంత విశ్రాంతి తీసుకుందామనుకునే సమయంలో ఫోన్ రానే వస్తుంది. మళ్ళీ ఏరాత్రికో ఇంటికి రావడం. నిద్రపోతూ, మధ్యలో తెలివొచ్చినప్పుడు ఫోన్‌చేసి కనుక్కోవడం...ఎన్నోసార్లు అర్థరాత్రుల్లోనూ లోపలికెళ్ళడం తప్పదు. నా కుటుంబంతో గడిపేందుకు సమయం దొరకడమే కష్టం. అట్లని జీతమేమన్న ఎక్కువొస్తుందాంటే అదీలేదు. మెట్రిక్యులేషన్ కూడా లేని కార్మికులు ఓవర్‌టైమ్‌తో నాకన్నా రెండింతల జీతం తీసుకుంటున్నారు. నన్ను చూస్తున్న మా బాబు అసలే ఇంజనీరింగ్ చదువనంటున్నాడు"

మోహనరావు మాటలు నన్ను ఆలోచించేటట్టు చేసాయి.

ఒక్కొక్కరిని కలుసుకొని మాట్లాడుతుంటే నాకెన్నో విషయాలు అవగతమవుతున్నాయి. ఆఫీసర్లుగా పిలువబడుతూ పైకెంతో గంభీరంగా కనబడేవాళ్ళలోనూ ఎంతో వేదన, దుఃఖం ఉండటం నాకాశ్చర్యాన్నే కలిగించింది. చాలామందిలోని గంభీరతలు మేకపోతు గాంభీర్యాలేననిపించాయి.

నా వాళ్ళ కొరకేదైనా చేయాలన్న పట్టుదల నాలో హెచ్చింది. గెలిచి కొన్ని సమస్యలకైనా పరిష్కారం చూడాలనిపించింది. అయితే ఏవేవో జిమ్మిక్కులు చేసి గెలవడం మాత్రం నాకసలే ఇష్టంలేదు.

" మల్లిఖార్జున్! రోజురోజుకూ వాతావరణం మనకనుకూలంగా మారినట్టే అనిపిస్తుంది. అంతటా నీ అభ్యర్థిత్వం గురించే చర్చలు జరుగుతున్నాయి. నలుగురున్న పోటీలో నీకూ మరో అభ్యర్థి మధ్యనే తీవ్రమైన పోటీ ఉండేట్టుంది. అయితే అందరూ ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నువ్వూ కొన్నైనా చేయక తప్పదు. " అన్నాడు మురళీధర్ నా దగ్గరకొచ్చి.

" నన్నేం చెయ్యమంటావో చెప్పు?" అడిగాను.

" మీ కులం వాళ్ళ మీటింగు పెట్టు. కనీసం వాళ్ళందరినీ నీ కులం పేరు చెప్పి ఓటెయ్యమనడుగు. బి.సి. ఫీలింగూ తీసుకురా. ఆ తర్వాత అయితే అవుతుంది లేకుంటే లేదు కాని ఎలిజిబిలిటీ ఉన్నవాళ్ళకు ప్రమోషన్లిప్పిస్తానని చెప్పు. ఇవన్నీ వాళ్ళు చేస్తున్న పనులే" అన్నాడు మురళీధర్.

" మురళీధర్! నా సంగతి తెలిసి కూడా నువ్విలా సలహాలివ్వడం నాకేం నచ్చలేదు. నేనలాంటిపనులు చచ్చినా చేయను. నా సిద్ధాంతాలు, మానిఫెస్టో నచ్చి గెలిస్తే మంచిదే. లేకుంటే నాకు పోయేదేం లేదు. మన ఓటర్లంతా విద్యావంతులన్న విషయం మరిచిపోకు. ఇంటలెక్చువల్స్ అయిన మనాఫీసర్లు ఏవేవో ప్రలోభాలకు లొంగుతారని నేననుకోను. వాళ్ళపై నాకు నమ్మకముంది. వాళ్ళు సరైన తీర్పే ఇస్తారని నేను భావిస్తాను. ఈ తీర్పును భారతదేశ మేధావుల తీర్పుగా పరిగణిస్తాను" అన్నాను.

" నువ్వో మూర్ఖుడివి. వెన్న రావాలంటే వేలును వంకర పెట్టక తప్పదు. "

" నాకవన్నీ నచ్చవు. కౌటిల్యాన్ని చాణక్య నీతనడం నాకు పడదు. ప్రిన్సిపుల్డ్‌గా నడుచుకోవడం మూర్ఖత్వమనుకుంటే నాకు మూర్ఖుడుగా బతకడమే ఇష్టం. నిన్ను నిరుత్సాహ పరుస్తున్నందుకు నన్ను మన్నించు."

**(మిగతా 31వ పేజీలో)**

ఇప్పుడు మళ్లీ వారెవరో కనుక్కోవాల్సి వుంది.

పోలీసులు తలలు పట్టుకున్నారు. మళ్లీ అన్వేషణ మొదలైంది.

రంగారెడ్డి జిల్లా, కర్నాటక సరిహద్దుల్లోని ప్రాంతాలలో గాలించిన పోలీసులు యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చివరి గ్రామం అయిన దేవనూరును మాత్రం మిస్ చేశారు. దేవనూరుకు చెందిన మంగళి వెంకటమ్మ కన్పించటంలేదని ఆమె మేనమామ రాయపోలు కిష్టప్ప, తల్లి బాలమణి వెతుకుతూ తాండూరులోని తన బంధువు రమేష్‌వద్దకు వచ్చారు. అలా విషయం పోలీసుల్ని చేరింది. తాండూరు సిఐకి ఎందుకో అనుమానం వచ్చి కాగ్నా నదివద్ద హత్యకు గురైన వారి ఫోటోలను చూపించాడు.

అంతే! ఆ ఫోటోల్ని చూడడంతోనే కిష్టప్ప, బాలమణి గొల్లుమన్నారు.

అత్తింటివారే ఈ అఘాయిత్యానికి పాల్పడివుంటారని హతురాలి తల్లి, మేనమామ ఫిర్యాదు చేశారు. దేవనూరుకు చెందిన భర్త శేఖర్‌తోపాటు అత్త మంగళి నర్సమ్మ, ఆమె సోదరుడు హుస్సేనప్ప, నాగప్ప,కిష్టప్ప తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఇంటరాగేషన్ ప్రారంభించారు.

ఇంటరాగేషన్‌లో నిందితులు జరిగిన కథనంతా చెప్పుకొచ్చారు.

** **

మహబూబ్‌నగర్‌జిల్లా కనుకుర్తి గ్రామానికి చెందిన మంగళి వెంకటమ్మకు రంగారెడ్డి జిల్లా దేవనూరు నివాసి శేఖర్‌తో పదేళ్లక్రితం వివాహం అయింది. వెంకటమ్మ అత్త నర్సమ్మ మాటలను ఖాతరు చేయకుండా స్వతంత్ర్యంగా వ్యవహరించడంతో కలహాలు మొదలయ్యాయి. భర్తతోపాటు ఇల్లు విడిచి వెళ్లిన వెంకటమ్మ తన మామ శకిరప్ప చనిపోయాడని దేవనూరుకి వచ్చింది. అంతకుముందే భర్త శేఖర్ తన తండ్రి అస్వస్థతతో బాధపడుతున్నాడని తెలిసి ఆ గ్రామానికి చేరుకున్నాడు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత అత్త మంగళి నర్సమ్మ తన కోడలు వెంకటమ్మతో తగవు పడింది. తన కొడుకుతోపాటు ఇంట్లోనే ఉండి తన అదుపాజ్ఞలలో ఉండాలని లేకపోతే సహించేది లేదని అత్త హెచ్చరించింది. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగి ఘర్షణ జరిగింది. తన కొడుకుతోపాటు మర్నాటి రాత్రి వెంకటమ్మ ఇంటినుండి కోపంతో బయటకు వెళ్లిపోయింది. అత్త, ఆమె సోదరుడు, చెల్లెళ్లు కలసి వెంకటమ్మను కొట్టి లోపలికి తీసుకురావడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటికే ఒక పథకం ప్రకారం తన కొడుకును అప్పుకోసం పక్క గ్రామానికి పంపించిన నర్సమ్మ తన కోడలి అంతు తేల్చాలని సోదరుడు హుస్సేనప్పతో చెప్పింది.

బస్సులో వెళుతున్న వెంకటమ్మను అత్త,ఆమె సోదరుడు,కూతుళ్లు,అల్లుళ్లు అంతా కలిసి వెంబడించారు. చెన్నూరు వద్ద బస్సు దిగి పిల్లబాటలో నడిచి వెళుతున్న వెంకటమ్మను కాగ్నా నదివద్ద పట్టుకున్నారు. వనంటి మంగళి హుస్సేనప్ప, మంగళి చిన్న నర్సింహులు, పెద్ద నర్సింహులు, మంగళి రామ్‌చందర్, నారాయణ,మంగళి నర్సమ్మలు కలిసి వెంకటమ్మ చేతులు కాళ్లు పట్టుకుని ఆమె చీరతోనే గొంతును బిగించారు. ప్రాణాన్ని రక్షించుకోవడానికి వెంకటమ్మ పదినిమిషాలపాటు ఎంత పోరాడినా ఫలితం లేకపోయింది. ఇరువైపులా ఇద్దరు మెడకు కొంగు బిగించి లాగడంతో ఊపిరాడక వెంకటమ్మ తుదిశ్వాస విడిచింది. తర్వాత తన తల్లి హత్యకు సాక్షిగా నిలిచిన మూడేళ్ల ఆమె కొడుకునుకూడా హతమార్చాలని నిర్ణయించారు. ఆరోజు కార్తీక పౌర్ణమి రాత్రి కావడంతో క్షుద్రశక్తుల పూజలపై అపారమ నమ్మకంవున్న మంగళి హుస్సేనప్ప,నర్సమ్మ ఇద్దరూ కలిసి బలికోసమని బాలుడిని చెరువుగట్టుపై నగ్నంగా కూర్చోబెట్టి స్నానం చేయించారు. రక్త సంబంధమన్న కనీస మమకారం అయినా లేకుండా నాయనమ్మ ఆ చిన్నారి బాలుడి తల,చేతుల్ని పట్టుకోగా హుస్సేనప్ప తన వద్దనున్న కత్తితో తలను నరికి చెరువులో పారేశాడు. ఈ ఘోర ఉదంతానికి సాక్ష్యంగా నోరులేని కాగ్నానది మౌనంగా రోదించింది.

నిందితులు తాము చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో పోలీసులు వారిని రిమాండ్‌కు పంపించారు. అయితే కాగ్నానది చెరువులో హంతకులు పారేసిన ఆ బాలుడి తల మాత్రం ఇంతవరకు లభించలేదు.

**-మ్యాడం మధుసూదన్**

## మేధావుల తీర్పు

(29వ పేజీ తరువాయి)

"ఆదర్శభావాలు సరే. నీకున్న రాజకీయ స్వప్నాలూ సరే. కాని నువ్వు నీదేశ మేధావుల మీద చాలా ఎక్కువ నమ్మకాన్ని పెట్టుకున్నావనిపిస్తుంది నాకు. మన దేశంలోని పెద్ద పెద్ద సైంటిస్టులు, భౌతిక రసాయన శాస్త్రాల్లోనూ డాక్టరేట్లు పొందిన వాళ్ళు కూడా ఏ పని ప్రారంభించినా కొబ్బరికాయ కొట్టందే ప్రారంభించరన్న విషయం మరిచిపోకు. వాళ్ళలో చాలామంది కులాల కంపులో, మతాల మౌఢ్యంలో కూరుకుపోయే ఉన్నారన్న విషయమూ మరిచిపోకు. బుద్ధిగా ప్రవర్తించి వచ్చిన మంచి అవకాశాన్ని జార విడుచుకోకు." అన్నాడు మురళీధర్.

నా అత్యంత ఆప్తమిత్రుడు, నా గూర్చి సంపూర్ణ అవగాహన ఉన్న మురళీధర్ నుంచి ఇలాంటి సలహాలొస్తాయని నేనూహించలేదు.

"మురళీధర్! నన్ను పోటీలోకి దింపే ముందేమన్నావు నువ్వు. ఇప్పుడేమంటున్నావు ? దిగనయితే దిగనీయి ఆ తర్వాత దిగజారకుంటే చస్తాడా అనుకున్నావా ? ఈ విషయంలో నువ్వెన్ని చెప్పినా వినను. నా పద్ధతి ప్రకారమే పోతాను. గెలిస్తే సరి. లేకుంటే నా మిత్రులందర్ని కలుసుకున్నానన్న తృప్తయినా మిగులుతుంది" అన్నాను.

"సరే నీ ఇష్టం. నేను వాస్తవాలను చెప్పాను. నువ్వేమో పుస్తకాల్లోని ఆదర్శాలను వదిలి బయటకు రావడం లేదు. ఏదేమైనా నేను నీతోనే ఉంటాను. ఈ మూడు రోజులు మనం మరింత బాగా ప్రయత్నించాలి" అన్నాడు మురళీధర్.

"మీరంతా ఇంటలెక్చువల్ కమ్యూనిటీకి చెందినవాళ్ళు. బాగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటారనే నా నమ్మకం. అందరి మానిఫెస్టోలనడిగి ఫైల్ చేసుకోండి. ఎవరు గెలిచినా ప్రతి నెలా వాళ్ళు చేస్తున్న పనులేంటో నిలదీసి అడగండి. ఏం చేయడమూ చేతగాకుంటే దిగిపొమ్మనండి. ఓటడుగ వచ్చేవాళ్లతో ఇలా చేస్తామని చెప్పండి. అలా అయితే మనలోని చైతన్యాన్ని చూసి ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేస్తారు. నాకు కావాల్సింది వ్యతిరేక ఓట్లు కాదు. ఇదివరకు చేసినవారిమీది వ్యతిరేకతతో నాకోటెయ్యడం నాకు నచ్చదు. నా విధానాలవీ నచ్చి నా మీద నమ్మకముండి ఏమన్నా చేయగలనన్న నమ్మకముంటేనే నా కోటెయ్యండి. లేకుంటే మీ ఇష్టం. నాక్కావలసింది మాత్రం పాజిటివ్ ఓటింగ్"

నా మాటలు జనాలమీద బాగానే పనిచేసినట్టున్నాయి. అంతటా నేను చెప్పిన విషయాల గూర్చి ముచ్చట్లే.

ఫ్యాక్టరీలో జరిగిన, జరుగుతున్న కొన్ని అవకతవకల గూర్చి చెప్పారు. 'మనం అన్నీ పట్టించుకోవాలి. ఫ్యాక్టరీ సర్వైవల్ గూర్చి కృషి చేయాల'న్నారు. 'నాకు సాధ్యమైనంతవరకు చేస్తా'నన్నాను.

"పతితులార! భ్రష్టులార! బాధా సర్పద్రష్టులార! మీకోసం వస్తున్నాము. నాలుగు గోడలను వదిలి వస్తున్నాము ఏడవకండేడవకండీ"

అంటూ మురళీధర్ శ్రీశ్రీ గేయం పాడుతూ బరువైన వాతావరణాన్ని తేలిక చేస్తున్నాడు.

**"మల్లిఖార్జున్! నువ్వాశిస్తున్న స్థాయికి సమాజ మెదుగలేదు. నువ్వు కోరుకుంటున్న ఇంటలెక్చువల్ నిర్ణయాలూ చోటు చేసుకోవడం లేదు. అదే జరిగితే మన దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలీ స్థితిలో ఉండేవి కావు. చాలామంది మేధావులు ఇంకా మధ్యతరగతి ఆలోచనల్లోంచే బయటకు రాలేక పోతున్నారు. నువ్వేమో ప్రిన్స్‌పిల్సంటూ పట్టుకు వేలాడుతున్నావు. సరే ఏమవుతుందో చూద్దాం.." అన్నాడు రెండ్రోజుల్లో ఎన్నికలున్నాయనగా మురళీధర్.**

రేపే ఎన్నికలనగా పరిస్థితంతా నివురుగప్పిన నిప్పులా ఉన్నట్లనిపించింది నాకు. చాలామంది నన్ను 'తప్పక గెలుస్తాననే' అంటున్నారు. మేధావులనుకున్న మా ఆఫీసర్ల మీదున్న నమ్మకం నాకూ గెలుపు తథ్యమనే అనిపించింది..

ఆ రోజే ఎన్నికలు. . ఎంత వద్దనుకున్నా భరింపరాని టెన్షన్.. ఓటువేయడానికి వెళ్తూ కూడా నా గురించే మాట్లాడుకోవటం విన్నాను.

ఓట్లయ్యాయి. ఓట్ల లెక్కింపూ అయిపోయింది. మూడు వందల యాభైలో నాకొచ్చిన ఓట్లు ఇరవై ఒకటి.. అంటే నా ఓటు కాక ఇరవై ఓట్లు వచ్చాయి.

"ఇదీ మన మేధావుల తీర్పు..." అన్నాడు మురళీధర్.

చిరునవ్వుతోనే జవాబు చెప్పాను మురళీధర్‌కు..

"ఇప్పటికైనా మేధావులపై ఓట్ల రాజకీయాలపై నీకున్న అభిప్రాయాలను మార్చుకుంటావా?" అడిగాడు మురళీధర్.

అవునో కాదో తెలియనట్టుగా తలూపాను.

"దేనికైనా సమయం రావాలి.. ఇంత స్వల్పకాలంలో ఇరవైమందిని నా అభిప్రాయాలతో ఏకీభవించేట్టు చేసానంటే అది ఎక్కువే"

ఓటమి నొప్పుకోలేక పైకలా అన్నానే కానీ, నాలో ఎన్నో సందేహాలు సుళ్ళు తిరుగుతూనే ఉన్నాయి.

"నువ్వే మధ్యతరగతి ఆలోచనల్లోంచి పూర్తిగా బయటపడలేదు..."

అంటూ వెళ్ళిపోయాడు మురళీధర్.